# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు




కవి భాస్కర్ మరణం సాహిత్యరంగానికి తీరని లోటు | 2

సంపుటి : 01 | సంచిక : 282 | వరంగల్ | శుక్రవారం, 14 ఆగస్టు 2026 | పేజీలు : 02



# పంటలను కాపాడటమే ప్రధాన లక్ష్యం

- దేవాదుల ద్వారా రఘునాథపల్లి మండలానికి సాగు నీరు
- బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నాయి
- కేటీఆర్, హరీష్ రావులకు ఏదో జబ్బు ఉన్నట్లు ఉంది
- ప్రతీ రోజు మీడియాలో కనిపించకుండా ఉండలేకపోతున్నారు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**పాలకుర్తి వాణి, రఘునాథపల్లి :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని దేవాదుల రిజర్వాయర్ల ద్వారా రైతుల పంటలను కాపాడడం కోసం గత నెల రోజులుగా రిజర్వాయర్లలో నీటిని నింపేందుకు కృషి చేసి సాగు నీరు విడుదల చేస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుండి పంట కాలువల ద్వారా ఎమ్మెల్యే కడియం శ్రీహరి నీటి పారుదల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి సాగు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ లో ఉన్న నీటి నిల్వలను ఎమ్మెల్యే పరిశీలించారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ కింద చివరి ఆయకట్టు వరకు సాగు నీరు వెళ్లే విధంగా నీటి విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువ నుండి వెళ్లే నీరు ఎక్కడ నిరూపయోగం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. ప్రతీ నీటి చుక్కను పొదుపుగా వాడుకొని పంటలను కాపాడుకోవాలని రైతులను కోరారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కొత్తగా వరి సాగు చేయకుండా ఇప్పటికే వేసిన వరి నాట్లను, ఆరుతడి పంటలను కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం రఘునాథపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చెసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నాయని ఆరోపించారు. బిఆర్ఎస్ డబ్బులు ఇచ్చి సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తోందని అన్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్ళలే తప్ప తప్పుడు ప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదని సూచించారు. కేటీఆర్, హరీష్ రావులకు ఏదో జబ్బు ఉన్నట్లు ఉందని, ప్రతీ రోజు మీడియాలో కనిపించకుండా ఉండలేకపోతున్నారని ఏద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




# ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రిజర్వేషన్ పక్కాగా అమలు

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**జనగామ, పాలకుర్తి వాణి :** షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన రిజర్వేషన్ అమలు, బ్యాక్లాగ్ ఖాళీల భర్తీ, పదోన్నతులు, సేవా అంశాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు, ఇతర సమస్యలపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి ముఖ్య అతిథిగా ఆయన సమీక్షించారు. వివిధ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ, వర్గాల వారికి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు తెన్నులను, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, వాటి పురోగతిపై చైర్మన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు కె. లక్ష్మీ నారాయణ, రాంబాబు నాయక్, సంతోష్ నాయక్, శంకర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, సీపిఓ చినకోట్యా నాయక్, డిఎంహెచ్ఓ వాణి శ్రీ, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి విక్రమ్, ఎసీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలు వర్గాల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకారుల ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాలు

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** శ్రావణమాస ను పురస్కరించుకొని పాలకుర్తి మండల కేంద్రంలోని సందర్భంగా పోచమ్మ తల్లి దేవాలయంలో పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారిని అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీపాద ఉప్పలా చారి,పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు ముత్తోజు రాజు ,కార్యదర్శి కడార్ల భాను చందర్,నంగునూరి సత్యం,మారోజు బిక్షపతి,శ్రీపాద శ్రీరాములు,పెంధోట రవీంద్రాచారి,రామగిరి నాగరాజు, శ్రీపాద సోమేశ్వర చారి,మారోజు ఉదయ్,పానుగంటి శివతేజ పాల్గొన్నారు.



# చిన్నమడుర్‌లో పంట పొలాలు పడావు

- 300 ఎకరాలు సాగు నీరు లేక వరి పంట పెట్టని రైతులు
- పంట వెయ్యకుండా పక్కన పెట్టిన పొలాలను చూసి ఆవేదన చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**పాలకుర్తి వాణి, దేవరుప్పల :** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చిన్నమాడుర్ నుండి రాంబోజీ గూడెం వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యలో రోడ్డు పక్కన గోపి చెరువు ఆయకట్టు కింద గల 300 ఎకరాల సాగు పొలాలు చెరువులో నీళ్లు లేక వానాకాలం పంటలు వెయ్యక పూర్తిగా పడావు పడ్డాయని రైతులు ఎర్రబెల్లితో వాపోయారు. గత పది సంవత్సరాలుగా నాట్లు వెయ్యకుండా ఉన్నది ఈ సంవత్సరంలోనే అని అన్నారు. వ్యవసాయం తప్ప ఇంకో ఆధారం లేదని ఎలాగైనా నవాబుపేట రిజర్వాయర్ నుండి నీళ్లు విడుదల చేయించి రైతులకు సహాయం అందించాలని ఎర్రబెల్లి ని కోరారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ఎండిపోయిన వాగును పరిశీలించి, పంట వేయకుండా ఖాళీగా ఉన్న పంట పొలాలను పరిశీలించి తెలంగాణలో అసమర్థ కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని మండిపడ్డారు, గత బిఆర్ఎస్ పాలనలో ఏటా నవాబుపేట రిజర్వాయర్ నింపి అక్కడి నుండి దేవరుప్పుల మండలంలోని గ్రామాల చెరువులు, కుంటలు, వాగుల మీద చెక్ డ్యామ్ నింపేవాళ్లమని అన్నారు. ప్రస్తుతం ఈ వర్షాకాలంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.సాగు నీరు అందించే అవకాశం ఉన్న కూడా ప్రభుత్వం పట్టింపు లేకుండా వ్యవహరిస్తుంది. దీనివల్ల గ్రామాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఇలాగే రైతుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తే రానున్న రోజుల్లో పెద్దయెత్తున రైతులతో కలిసి నిరసనలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల బిఆర్ఎస్ నాయకులు, చిన్నమడుర్, రాంబోజిగూడెం గ్రామాల రైతులు పాల్గొన్నారు.







## కవి పొట్టబత్తిని భాస్కర్ మరణం

# సాహిత్యరంగానికి తీరని లోటు

### పద్మశ్రీ గడ్డం సమ్మయ్య

**పాలకుర్తి వాణి, జనగామ :** సామాజిక కవి, ఉపాధ్యాయుడు పొట్టబత్తిని భాస్కర్ ఆకస్మిక మరణం కళా,సాహిత్య రంగాలకు,జనగామ గడ్డకు తీరని తీరనిలోటని పద్మశ్రీ గడ్డం సమ్మయ్య అన్నారు. జనగామ కెమిస్ట్రీ భవన్‌లో కవులు కళాకారుల ఐక్యవేదిక పొట్టబత్తిని భాస్కర్ యాదిలో ఏర్పాటు చేసిన కలాలు గళాల నీరాజనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి పెట్లోజు సోమేశ్వరా చారి, జరసం అధ్యక్షుడు నక్క సురేష్ అధ్యక్షత వర్గంగా సాగిన ఈ కార్యక్రమంలో సమ్మయ్య మాట్లాడుతూ భాస్కర్ కవి సామాజిక స్పృహ కలిగి చక్కని వచన కవిత్వం సృజించారని అన్నారు. ఉపాధ్యాయులుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన గురువు భాస్కర్ అని గుర్తు చేశారు. సభలో పాల్గొన్న ప్రజా వైద్యులు కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి మాట్లాడుతూ భాస్కర్ భౌతికంగా మన మధ్యలో లేకున్న ఆయన విడిచి వెళ్లిన ఆశయాలు మన ముందున్నాయని అన్నారు. నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు నెల్లుట్ల రవీందర్ రావు మాట్లాడుతూ కవి భాస్కర్ చక్కని వ్యక్తిత్వం కలిగినవారని అన్నారు. తొలుత భాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, నెల్లుట్ల రవీందర్ రావు, జి.కృష్ణ, లగిశెట్టి ప్రభాకర్, డా.వేముల సదానందం,కొలిపాక బాలయ్య, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, గుగ్గిల నర్సయ్య,గట్టగల్ల సంజీవ, కడారి శ్రీను, చిలుమోజు సాయికిరణ్, రంగరాజు ప్రసాద్, సదానందం, గడ్డం మనోజ్ కుమార్ గౌడ్, మాన్యపు భుజేందర్, అంకాల సోమయ్య, మసురం రాజేంద్రప్రసాద్, బాల్నె నీరజ, గుండె కనకయ్య, గొలుసుల ఎల్లయ్య, గొలుసుల నర్సయ్య,టి.రామచంద్రం, జోగు సుదర్శన్,వినోద్, రాజు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** బిజెపి రాష్ట్ర పార్టీ, జిల్లా పార్టీ పిలుపుమేరకు పాలకుర్తి మండల కేంద్రంలో మండల అధ్యక్షులు మారం రవి కుమార్ ఆధ్వర్యం లో"హర్ ఘర్ తిరంగా" బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవి హాజరయ్యారు. తొలుత బిజెపి పార్టీ శ్రేణులు కలిసి గుడివాడ దేవస్థానం నుంచి, రాజేష్ చౌరస్తా, ప్రధాన వీధుల నుంచి తిరంగా బైకు రాలి నిర్వహించారు.ఈ సందర్భంగా రవి, రాష్ట్ర నాయకులు దొంగరి మహేందర్ లు కలిసి మాట్లాడుతూ ప్రతి ఒక్క భారతీయులు ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు.ఈ కార్యక్రమం వల్ల భారతీయులలో దేశ భక్తి పెరిగి సమన్వయం తో దేశ ఔన్నత్యాన్ని పెంచి అభివృద్ధి కి దోహద పడుతుంది అని ఒక ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచంలోనీ ఏ దేశానికి వెళ్లిన భారత దేశ గొప్పతనాన్ని వివరిస్తూ భారత కీర్తిని ప్రపంచమంతా వ్యాపించేలా కృషి చేస్తున్నారని, ఇలాంటి మహనీయులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడు పై ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సుకరనేనికోటేశ్వర్,జిల్లా నాయకులు కమ్మగాని శ్రీకాంత్ గౌడు , జిల్లా కౌన్సిల్ సభ్యులు మంచినీళ్ల ఉపేందర్ రెడ్డి,ప్రోగామ్ జిల్లా కో కన్వీనర్ పెండ్యాల గణేష్ , మండల ప్రధాన కార్యదర్శులు పెనుగొండ సోమేశ్వర్, వేల్పుల దేవరాజు, మండల ఉపాధ్యక్షులు పబ్బా సంతోష్, ఎస్టి మోర్చా నాయకులు శంకర్,ఎస్సీ మోర్చా నాయకులు ఇలవెల్లి యాకయ్య, నాయకులు కేరళ కరుణాకర్, రాములు, చేతన్, తండా వినయ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ చందు నాయక్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో శ్రావణమాసం పూజలు



**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్న శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి రోజు గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి గణపతి పూజ,ఏకాదశ రుద్రాభిషేకంతో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు డివిఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజ నాగరాజు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341